క్లుప్తంగా

నేడు కార్మిక, రైతు సంఘాల జిల్లా సదస్సు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో కార్మిక, రైతు సంఘాల జిల్లా సదస్సు ఆదివారం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామీణ బంద్ విజయవంతం కోసం సదస్సులో కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి కార్మిక, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నిధులు మంజూరు చేయాలి

తాంసి: భీంపూర్ మండలంలోని తాంసి(కె) గ్రామస్తులు శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిశారు. నేరడిగొండలోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రవీణ్, కరీం, రవీందర్, భోజన్న యాదవ్, స్వామి, అరవింద్ పాల్గొన్నారు.

5 నుంచి వాలీబాల్ పోటీలు

నేరడిగొండ: మండలంలోని వాగ్దారి గ్రామంలో ఈనెల 5 నుంచి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బంజారా ఉషోదయ యూత్‌క్లబ్ సభ్యులు రాథోడ్ దినేష్, జాదవ్ రాజ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

అమరవీరుల స్తూపానికి క్షీరాభిషేకం

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ పునర్నిర్మాణ సభకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు స్తూపంపై చెప్పులతో ఎక్కడంతో అపవిత్రం జరిగిందని శనివారం తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల నాయకులు క్షీరాభిషేకం చేసి, శుద్ధి చేశారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్క బాపురావ్ మాట్లాడుతూ.. ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు నియమ నిష్టాలతో ఉంటాయన్నారు. కార్యక్రమంలో అమరవీరుల ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావ్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, జుగ్నాక్ భారత్, కోట్నాక్ భారిక్‌రావ్, కోరెంగా సుంకట్‌రావ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: జూనియర్ లెక్చరర్ల సంఘం – 475 ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరం క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలోని ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో డీఐఈవో రవీందర్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవాండ్లు, నాన్ టీచింగ్ స్టాఫ్ జిల్లా అధ్యక్షుడు మోసిన్, చట్ల ప్రవీణ్ కుమార్, రాజేందర్, నరసయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

బోథ్: ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుమేర్ పాషా మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మున్సిఫ్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్, నరేశ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు గొడిసెల రమణ గౌడ్, అల్లం సాయికృష్ణలు అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్ రెడ్డి, నాయకులు గంగాధర్, వివేకానంద యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పూజలు

బేల: మండలంలోని సదల్‌పూర్ శివారులోని బైరందేవ్, మహాదేవ్ ఆలయాల ప్రాంగణంలో శనివారం జాతర ప్రారంభం కావడంతో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ బోయర్ విజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాక్రే మురళీధర్, మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు బోనిగిరివార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, సలాం దేవ్‌రావు, బర్కాడే రాము, ధర్నే జీవన్ పాల్గొన్నారు.

రాజాసింగ్‌ను కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. బ్రహ్మానంద్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అవసరమైతే తన సేవలు కూడా తీసుకోవాలన్నారు. ఆయన వెంట బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్ చంద్ర, సినీ నటుడు అభినవ సర్దార్, కేంద్రేకుమార్, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో కాలనీలు

- రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు
- తాగునీటికి తప్పని తిప్పలు
- నాలుగేళ్లు గడిచినా చర్యలు శూన్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాల్ పరిధిలోని విలీన కాలనీల పరిస్థితి అధ్వానంగా మారింది. విలీనమై నాలుగేళ్లు గడుస్తున్నా.. కనీస మౌలిక సౌకర్యాలకు నోచుకోవడం లేదు. సీసీరోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు వంటి కనీస వసతులు కరువయ్యాయి. వాటిని కల్పించాల్సిన మున్సిపల్ పాలకవర్గం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ఆయా కాలనీల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో విలీనమైతే తమ సమస్యలు దూరమవుతాయని భావించిన ఆయా కాలనీ వాసులకు నిరాశే ఎదురవుతుంది.



ఆదర్శనగర్‌లో రోడ్డు పక్కన నిలిచిన మురుగునీరు

గ్రామాల కంటే అధ్వానం..

గ్రేడ్– 1 స్థాయికి ఎదిగిన ఆదిలాబాద్ మున్సిపాల్టీలో మొత్తం 36 వార్డులుండేవి. 2018 ఎన్నికల సమయంలో పట్టణ స్వరూపాన్ని మార్చాలని భావించిన ప్రభుత్వం మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న మావలలోని రాంనగర్, దస్నాపూర్, పిట్టలవాడ, దుర్గానగర్, టీచర్స్‌కాలనీ, కోజాకాలనీ, 170 సర్వే నెంబర్‌లోని కాలనీ హన్మాన్‌నగర్, బట్టిసావర్గాం పరిధిలోని న్యూహౌజింగ్‌బోర్డు, అనుకుంట గ్రామ పంచాయతీగా ఉన్నటువంటి అనుకుంట గ్రామంతో పాటు దాని పరిధిలోని బంగారుగూడ, రాంపూర్ పంచాయతీగా ఉన్న రాంపూర్ గ్రామాన్ని పట్టణంలో విలీనం చేశారు. ఈవార్డులతో కలిపి మొత్తం 49 వార్డులుగా విభజించి ఎన్నికలు నిర్వహించారు. ఆయా కాలనీలు, గ్రామాలను పట్టణంలో విలీనం చేయడంతో తమ ప్రాంతాల రూపురేఖలు మారుతాయని ప్రజలు సంబరపడ్డారు. కానీ విలీనమై నాలుగేళ్లు గడుస్తున్నా.. నేటికీ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కొన్ని కాలనీల పరిస్థితి చూస్తే గ్రామాల కంటే అధ్వానంగా ఉంది.

కనీస సౌకర్యాలు కరవు..

విలీనమైన పలు కాలనీల్లో ఇప్పటికి కనీస మౌలిక వసతుల్లేవు. 170 సర్వే నెంబర్ కాలనీ పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. కొత్తగా ఏర్పడ్డ కాలనీ కావడంతో ఇప్పటికీ ప్రధాన రోడ్డు లేదు. ఇక అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం ఒక్కటి కూడా జరుగలేదు. తాగునీటి వసతి కూడా లేకపోవడంతో ఇక్కడి ప్రజలు నిత్యం ఇబ్బందుల నడుమ జీవనం సాగించాల్సి వస్తోంది. డ్రెయినేజీల లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమల బెడద అధికమై వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. బంగారుగూడ. కేఆర్‌కే కాలనీ, కోజా కాలనీల్లో కూడా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మున్సిపల్ పాలకులు, అధికారులు స్పందించి కాలనీల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం రూ. లక్షపదహారు వేలతో పాటు తులం బంగారం ఇవ్వాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రతిరోజు ప్రజల మధ్యలో ఉంటూ.. ప్రజాసమస్యల పరిష్కరం కోసం పని చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, ఎంపీపీలు నిమ్మల ప్రీతంరెడ్డి, రాథోడ్ సజన్‌లాల్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, లోక శిరీష్‌రెడ్డి, తృప్తి గంగాధర్, సాబీర్ పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి మల్లిక, ఎంఈవో ఉదయ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నాణ్యమైన విద్యనందించాలి

నేరడిగొండ: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనపై ఆరా తీశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మొదటిసారి పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతంరెడ్డి, నాయకులు సాబ్లే నానక్‌సింగ్, ప్రతాప్ సింగ్, అల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, సద్దాం ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. వడూర్ గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. హనుమాన్, శివలింగేశ్వర, సాయిబాబా ఆలయాలతో పాటు దర్గాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబేకర్ పండరి, సయ్యద్ లాలు, గాదె శంకర్, షేక్ ఫయ్యాజ్, ఆదుముల్ల భూషన్, పాల శంకర్, ఆదుముల్ల రాములు, గాదె రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, నానక్ సింగ్, అనిల్ యాదవ్, కొట్టాల మోహన్ పాల్గొన్నారు.

కుష్ఠుపై విద్యార్థులకు అవగాహన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇచ్చోడ: ప్రతి విద్యార్థికీ కుష్ఠుపై అవగాహన ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. 110 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నరేశ్, ప్రిన్సిపాల్ రత్న కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి

తాంసి: మండలంలోని కజ్జర్ల రైతువేదికలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్, అదనపు న్యాయమూర్తి శివరాం ప్రసాద్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో రమాకాంత్, వైద్యాధికారి హరీష్ పాల్గొన్నారు.

సన్మానం

బోథ్: బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్‌ను గ్రామస్తులు శనివారం సత్కరించారు. బోథ్ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి తోడ్పడ్డారని పేర్కొన్నారు. ఐదేళ్ల పాలనలో తనకు సహకరించిన గ్రామస్తులకు తాజీ మాజీ సర్పంచ్ సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోథ్: ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు పొందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీతను మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మల్లెపూల సుభాష్, భీమ బుచ్చన్న, రమణ గౌడ్, నారాయణ, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

పక్షుల దాహార్తి తీర్చాలి

బోథ్: వచ్చే వేసవిలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ తమ ఇంటి వద్ద, పాఠశాల వద్ద నీటి తొట్టెలను ఏర్పాటు చేసుకోవాలని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ అన్నారు. శనివారం సొనాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

ఇచ్చోడ: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని బావోజీపేట్‌లో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. ప్రజలు తమ పిల్లలకు చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. మోటారు వెహికిల్ చట్టం, వరకట్నం, బాల కార్మిక నిర్మూలన, విద్యాహక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సై నరేశ్, మాజీ సర్పంచ్ టెకం దేవురావ్, పంద్రం శంకర్, కుమ్మరి విజయ్, ఆనందరావ్, చందర్, భీంరావ్, బాపూరావ్, మణిరాం, గుండాల రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి హుస్సేన్

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

బోథ్: మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి హుస్సేన్ అన్నారు. శనివారం బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, గుడిహత్నూర్, సిరికొండ, బజార్‌హత్నూర్ మండలాలకు చెందిన ఎస్సైలతో కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో భాగంగా వీలైనంత ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకి ఊరేగింపు



పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని గ్రామాల్లో ముజ్జి మల్లన్న దేవుడి పల్లకిని శనివారం ఘనంగా ఊరేగించారు. గ్రామస్తులు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.

వీహెచ్‌పీ కార్యవర్గం ఎన్నిక

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో శనివారం విశ్వ హిందూ పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వేంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా బిరాజ్దార్ ఉద్దవ్, ఉపాధ్యక్షుడిగా విఠల్, కార్యదర్శిగా స్వామి, సహా కార్యదర్శిగా వెంకటేశ్, తదితర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నారాయణ, గంగాధర్, గ్రామపెద్దలు రాంచందర్ రెడ్డి, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ప్రత్యేకాధికారులకు అవగాహన

తాంసి: గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలన చేపట్టింది. ఇప్పటికే గ్రామాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. కాగా శనివారం ఆయా మండలాలోని గ్రామాలకు చెందిన ప్రత్యేకాధిరులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకారులు పాల్గొన్నారు. కలెక్టర్ వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. వీసీ కార్యక్రమంలో తహసీల్దార్‌లు లక్ష్మి, రాజ్‌మోహన్, సూపరింటెండెంట్ రవీందర్, ఎంపీవో స్వప్నశీల, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: రానున్న వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఆదేశించారు. శనివారం మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం అధికారులతో కలిసి పట్టణంలోని ఫిల్టర్‌బెడ్, లాండసాంగ్వీ పంప్‌హౌస్‌లను పరిశీలించారు. భగీరథ నీటి సరఫరాలలో కలిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి జోగు రామన్న చొరవతో కోట్ల రూపాయలను సమాకుర్చుకొని పలు ఏరియాలకు ప్రత్యేకంగా భగీరథ పైప్‌లైన్లను ఏర్పాటు చేశామన్నారు. ఇంటింటికీ నల్లాలను సైతం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్, మున్సిపల్ డీఈలు తిరుపతి, యూనూస్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జోగు ప్రేమేందర్

‘రోడ్డు నిబంధనలు పాటించాలి’

బోథ్: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్సై రాము అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వాహనాలను నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపవద్దన్నారు. వాహనదారులను చైతన్యపరిచే విధంగా నాగబూషణం పాఠశాలకు చెందిన విద్యార్థులు నృత్యం, నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

నార్నూర్: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా ఆటో డ్రైవర్లు నడుచుకోవాలని సీఐ రహీం పాషా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఆటో డ్రైవర్లు సన్మానించారు. రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. తమ వెంట వాహన పత్రాలు ఉంచుకోవాలన్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం: మరమ్మతుల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జిల్లా విద్యుత్‌శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భుక్తాపూర్ ఫీడర్ పరిధిలోని భాగ్యనగర్, తిలక్‌నగర్, భుక్తాపూర్, క్రాంతినగర్, మహాలక్ష్మీవాడ, చిల్కూరి లక్ష్మీనగర్, తాటిగూడ, వడ్డేర కాలనీ, అంబేద్కర్, గాంధీచౌక్, శివాజీచౌక్, తాంసి బస్టాండ్ ఏరియా, పంజేషా, బడ్కా మొహళ్ల, బ్రహ్మాడవాడ, తిర్పెల్లి, జీఎస్ ఎస్టేట్ ఏరియాల్లో, విద్యానగర్, ద్వారకానగర్, సినిమా రోడ్, మొచిగల్లీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. అలాగే కైలాస్‌నగర్, మావల ఫీడర్ల పరిధిలోని రిమ్స్ ఆస్పత్రి, సంజయ్‌నగర్, టీచర్స్‌కాలనీ, కలెక్టరేట్‌రోడ్, ఓల్డ్ హౌసింగ్‌బోర్డు, కైలాస్‌నగర్, కుమ్మరివాడ, అటెండర్స్‌కాలనీ, వాల్మీకినగర్, శాంతినగర్, దస్నాపూర్, రాంనగర్ ప్రాంతాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఇచ్చోడ: మండలంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకటేశ్ తెలిపారు. 33 కేవీ పరిధిలో ట్రీ కటింగ్ చేపడుతున్నందున ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

హీరాసుక జయంతి కరపత్రాల ఆవిష్కరణ

కైలాస్‌నగర్: గోండి ధర్మగురు హీరాసుక జయంతి ఈనెల 26న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పర్ధాన్ సమాజ్ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో కుష్బూ గుప్తా ఆవిష్కరించారు. కార్యక్రమానికి రావాల్సిందిగా సమాజ్ నాయకులు వారికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో పూసం ఆనంద్‌రావు, దుర్వ నగేశ్, మడావి శంకర్, గేడం మాధవ్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఎమ్మెల్యే పరామర్శ

గుడిహత్నూర్: మండలంలోని పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన లద్దే విశ్వాంబర్ తల్లి, పీఏసీఎస్ చైర్మన్ చిన్నాన్న రఘునాథ్ ముండే, షేక్ మహమ్మద్ అనారోగ్యంతో మృతి చెందారు. కొల్హారీ గ్రామానికి చెందిన జంట దంపతులు విజయ్ సేవాళే, శాంతాపూర్‌కు చెందిన సాబ్లే అవినాష్‌లు ఆత్మహత్య చేసుకున్నారు. కొల్హారీ గ్రామానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, ఎంపీటీసీ షగీర్ ఖాన్, జాదవ్ రమేశ్, మాధవ్ కేంద్రే, గజానంద్ గిత్తే, పవార్ రవీందర్, వెంకట్రావ్, దిలీప్ ఫడ్, ఎండీ గఫార్ ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన రోహిత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతంరెడ్డి, అనిల్ యాదవ్, నానక్‌సింగ్, మేర్‌సింగ్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పార్కింగ్





జిల్లా కేంద్రంలోని రైతుబజార్ సమీపంలో రోడ్డుపై ట్రాఫిక్ ప్రజలకు సమస్యగా మారుతోంది. రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను పక్కన నిలపాలని కోరుతున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్